నేడు బస్తీ దవాఖాన ప్రారంభం

బడంగ్‌పేట, ఫిబ్రవరి 7 : బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ రాజీవ్ గృహకల్పలో నూతనంగా నిర్మించిన బస్తీ దవాఖానను ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి శనివారం ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పేద ప్రజలు బస్తీ దవాఖానలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులు పరిశీలన

శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఏఈ వెంకన్న

సైదాబాద్, ఫిబ్రవరి 7 : షబే బరాత్‌ను పురస్కరించుకొని సైదాబాద్ శంకేశ్వర బజార్‌లోని హనిఫియా మసీద్ శ్మశాన వాటికల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ ఏఈ వెంకన్న, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. శ్మశాన వాటికలో పిచ్చి మొక్కల తొలగింపు పనులు, చెట్ల కటింగ్, పరిసరాల పరిశుభ్రత, అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌ను అడిగి తెలుసుకొని చేపట్టాల్సిన పనులను త్వరలోనే ప్రారంభించి, షబే బరాత్ నాటికి పూర్తి చేస్తామని తెలిపారు. మసీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్, శ్మశాన వాటిక ఇన్‌చార్జి నవాబ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవు

బడంగ్‌పేట, ఫిబ్రవరి 7: బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటామని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తెలిపారు. తడి పొడి చెత్తను వేరుచేసి చెత్త ఆటోలలో వేయాలని ఆయన కాలనీవాసులకు సూచించారు. రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చికెన్ షాప్ లో యజమానులు రాత్రి సమయాలలో చికెన్ వ్యర్థ పదార్థాలను రోడ్లపై వేస్తున్నట్టు తమ విచారణలో తేలిందన్నారు. ఇండ్లు డిస్మెంటల్ చేసిన వాటిని కూడా కుప్పలుగా పోస్తున్నట్లు తెలుస్తుందన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా విధిస్తామన్నారు. తడి పొడి చెత్త పై కాలనీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాలనీలలో పర్యటించి డ్రైనేజీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. పారిశుధ్యం లోపిస్తే సమస్యలు వస్తాయని కాలనీవాసులకు తెలిపారు. కాలనీ అసోసియేషన్ వారు మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

సిగ్నల్స్ లేక ప్రమాదాలు

- హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలు
- అడ్డదిడ్డంగా వెళ్తున్న వాహనాలు
- ఆందోళనలో వాహనదారులు
- ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని వేడుకోలు

ట్రాఫిక్ సిగ్నల్స్ లేక పోవడంతో ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు

కందుకూరు, ఫిబ్రవరి 7 : హైదరాబాదు-శ్రీశైలం జాతీయ రహదారిపై ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఎంతో మంది ప్రమాదాలకు గురవుతున్న పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై వాహనాలు ఎక్కువ కావడంతో పాటు అతి వేగంగా వెళుతుండడంతో ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కాలం గడుపుతున్నారు. ఆయా బస్సు స్టాపుల్లో బస్సుల కోసం వేచి చూస్తున్న తరుణంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడుతున్నారు. సెలవు రోజుల్లో అయితే వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఆదివారం వచ్చిందంటే చాలు ఏదో ప్రమాదం జరుతుంది. హైదరాబాదు నుంచి శ్రీశైలం వెళ్లే వాహనాలతో పాటు శ్రీశైలం నుంచి హైదరాబాదు వెళుతున్న వాహనాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ రహదారిలో ఉన్న మండల కేంద్రంలో పాటు రాచులూరు, కొత్తూరు, గూడూరు, కొత్తగూడ, దెబ్బడగూడ, ముచ్చర్ల దాసర్లపల్లి గేటుల వద్ద ఆయా గ్రామాలకు వెళ్లడానికి మలుపు తిరిగే సమయంలో సిగ్నల్స్ లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక గేటు వద్ద ప్రమాదం జరుగుతూనే ఉంది. ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగితో పాటు అనేక మంది మృతి చెందారు. అనేక మంది ప్రమాదాలకు గురై విగతజీవులుగా కాలం గడుపుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులకు అధికారులకు విన్నవించిన ఎవ్వరు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు.

చొరవ తీసుకోవాలి

జాతీయ రహదారిపై సిగ్నల్స్ లేక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది ప్రమాదాలకు గురయ్యారు. చాలా మంది విగతజీవులుగా కాలం గడుపుతున్నారు. ఆర్అండ్‌బీ, పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రమాదాలు జరగకుండా సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి.

-సురుసాని రాజశేఖర్‌రెడ్డి,
ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు

సిగ్నల్స్ ఏర్పాటు చేయాలి

జాతీయ రహదారి కందుకూరుతో పాటు ప్రధాన గేట్ల వద్ద సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలి. సిగ్నల్స్ లేక పోవడం వల్ల కందుకూరు, నేదునూరు, గూడూరు, రాచులూరు గేట్ల వద్ద అనేక ప్రమాదాలు జరిగాయి. వాహనాలు అతివేగంగా వెళుతున్నాయి. ఎక్కడో ఒక చోట ప్రమాదం జరుగుతుంది.

-దీక్షిత్‌రెడ్డి, బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్

బీసీల గొంతుకోసిన కాంగ్రెస్

బోడుప్పల్, ఫిబ్రవరి7: కులగణన పేరుతో బీసీ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని ద్రోహానికి పాల్పడ్డదని బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకులు కొత్త రవిగౌడ్ ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...2014లోనాటి ముఖ్య మంత్రి నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 51శాతం ఉన్న బీసీలు 46శాతా నికి ఎలా తగ్గుతుందని నిలదీశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు కులగణన పేరుతో సీఎం రేవంత్ కొత్త నాటకానికి తెరలేపారని ఆరోపించారు.

నోటి దురుసు బీసీజాతికి నష్టం

బీసీల నాయకుడిగా పేటెంట్ హక్కు తనకే ఉందన్నట్టు కొంత మంది కాంగ్రెస్ నేతలు అవాక్కులు చెవాకులు పేలుతు న్నారని, దీంతో బీసీలకు తీరని నష్టం జరుగుతుందని కొత్త రవిగౌడ్ అన్నారు. దశాబ్దాలుగా బీసీ హక్కులకై పోరాడుతు న్న ఆర్.కృష్ణయ్యలాంటి నాయకున్ని వెన క్కి నెట్టి ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న నోటి దురుసుతో కులాల మధ్య చిచ్చు పెడుతు న్నారని అన్నారు. ఇతర వర్గాలను కించపరచడం సరికాదన్నారు.

రేషన్ బియ్యం, గోధుమలు పట్టివేత

వ్యాన్‌లో ఉన్న రేషన్‌బియ్యం, గోధుమలు

రామంతాపూర్,ఫిబ్రవరి 7:అక్రమంగా తరలిస్తున్న రేషన్ ఫ్ బియ్యం, గోధుమలను పట్టుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం ఉప్పల్ ఐడీఏ జెర్సీ కంపెనీ ఎదురుగా ఉన్న పార్కింగ్ వద్ద అక్రమంగా నిల్వంచిన 140 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ,10 క్వింటాళ్ల గోధుమలను ఉప్పల్ పోలీసులు పట్టుకున్నారు. డీసీఎం, రెండు అశోక్ లేలాండ్ ట్రక్కులను పట్టుకున్నారు. డ్రైవర్ వెంకట్‌రెడ్డి ని అరెస్టు చేసి న పోలీసులు బియ్యాన్ని , గోధుమలను సీజ్ చేసి డ్రైవర్‌ను, మూడు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. పరారీలో ఉన్న అబ్బును కోసం పోలీసులు గాలిస్తున్నారు

నిధులు మంజూరు చేయాలని వినతి



జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్వేత

సైదాబాద్, ఫిబ్రవరి 7 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు సంబంధించిన నిధులను మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేత చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ నుంచి అధిక మొత్తం ట్యాక్స్ చెల్లిస్తున్నప్పటికీ నిధుల మంజూరు, అభివృద్ధి పనుల కేటాయింపులో వివక్ష చూపుతున్నారని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కోటి 68లక్షల రూపాయల అభివృద్ధి పనులు మొదలు పెట్టాలని, 18 నెలలుగా డివిజన్‌కు ఎటువంటి బడ్జెట్ కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

వనస్థలిపురం, ఫిబ్రవరి 7 : ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని పీస్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ సూచించారు. శుక్రవారం ఎన్జీవోస్ కాలనీలోని కాపు భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్నప్పుడే జీవితంలో ఏదైనా సాధించగలుగుతామన్నారు. నిత్యం పెరుగుతున్న కాలుష్యం, ఆహార అలవాట్లలో వస్తున్న మార్పుల దృష్ట్యా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. శిబిరంలో ఉచిత కంటి పరీక్షలు, దంత పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అవసరమైనవారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం అధ్యక్షుడు కోటేశ్వర రావు, ప్రదాన కార్యదర్శి పున్నయ్య, రత్నా రావు, స్ఫూర్తి సేవా సమితి అధ్యక్షుడు కొలిశెట్టి సంజయ్‌కుమార తోట హనుమంత రావు, వీవీ సత్యనారాయణ, వెంకటేశ్వర రావు, నరసింహ, ప్రసాద్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

చిత్రలేఖనం పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 7: చిన్న తనం నుంచే విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎల్బీనగర్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ శాంసన్ జోసెఫ్ తెలిపారు. రాచకొండ కమిషనరేట్ పరిధి నాగోల్, రాక్ టౌన్‌కాలనీలోని చిల్డ్రన్స్ ట్రాఫిక్ ట్రైనింగ్ పార్కులో రాచకొండ ట్రాఫిక్ పోలీసులు, హీరో మోటో క్రాఫ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం రోడ్డు భద్రతపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్ బ్యాంకు కాలనీకి చెందిన కాకతీయ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు ట్రాఫిక్ సీఐ శాంసన్ జోసెఫ్ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను పాటించినట్లయితే ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. కొందరు ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ తాము ప్రమాదాల బారినపడటమే కాకుండా ఎదుటి వారి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ఏఎస్ఐ సోమనాథ్, పాఠశాల హెచ్ఎం పరిమళి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇండ్లు మంజూరు చేయాలి

మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాంచందర్

కందుకూరు, ఫిబ్రవరి 7 : సీపీఎం పోరాట ఫలితంగా పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుబ్బాక రాంచందర్ అన్నారు. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ గోపాల్ ఇచ్చిన మాట ప్రకారం 788, 107, సర్వే నంబర్లలో పేదలకు ఇండ్ల స్థలాల కోసం కబ్జా చూయించడానికి శుక్రవారం సర్వే నిర్వహించారు. అనంతరం లే అవుట్ చేసి ప్లాట్లుగా గుర్తించి బాధితులకు అప్పచెబుతామని జగదీశ్వర్‌రెడ్డి, సూచించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు రాంచందర్ మాట్లాడుతూ అధికారుల కృషి వల్ల పేదలకు న్యాయం జరుగుతుందని వివరించారు. ఇండ్లను మంజూరు చేయాలని చేయని పక్షంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రకమంలో సీపీఎం మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్, మాజీ కార్యదర్శులు కుమార్, శ్రీనివాస్,గుడిసెల సంఘం అధ్యక్షుడు రాయకంటి శేఖర్, లబ్ధిదారులు అంజయ్య, జంగయ్య, కృష్ణయ్య,యాద య్య, చెం చల, అరుణ, రాజమణి,జంగమ్మ పాల్గొన్నారు.

నేడు జాతీయ సదస్సు

కాచిగూడ : అవంతి డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో కాంక్లేవ్-2025 పేరుతో కాచిగూడ మున్నూరుకాపు సంఘం హాల్‌లో శనివారం జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ సాయిరాం ఒక ప్రకటనలో తెలిపారు. బిట్స్‌పిలానీ డైరెక్టర్ ప్రొఫెసర్ ముఖర్జీ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, అవంతి కళాశాలల వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, ఫిబ్రవరి 7 : రాబోయే రంజాన్ పండుగను పురస్కరించుకొని నియోజకవర్గ పరిధిలో పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై జీహెచ్ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే అహ్మద్ బలాల సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం పాతబస్తీలోని ఫంజేషాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధికారులతో పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా సైదాబాద్, అక్బర్‌బాగ్, పాతమలక్‌పేట, మూసారాంబాగ్, అజంపురా, చావునీ డివిజన్లకు చెందిన జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ శాఖలతో ఆయా డివిజన్ల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతం చేయటంతోపాటు సకాలంలో పూర్తయ్యే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నత్తనడకన నడుస్తున్న పనుల వివరాలను తెలుసుకొని వాటికి గల కారణాలను విశ్లేషించి తగిన చర్యలు తీసుకోవాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని, లోపాలు ఉంటే అందుకు బాధ్యత అధికారులే వహించాల్సి ఉంటుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని ఈద్గా మైదానాలను, శ్మశానవాటికలను, దర్గాల వద్ద అభివృద్ధి పనులను చేపట్టాలని, అందుకు సంబంధించిన పనుల ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన పనులను వెంటనే మొదలు పెట్టి రంజాన్ పండుగ నాటికి పూర్తిచేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈలు వెంకన్న, మల్లికార్జున్, మహ్మద్ మోబిన్, షరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో 57 కులాల గొంతు కోశారు..

- ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైరి నరేశ్

రవీంద్రభారతి,ఫిబ్రవరి 7 : ఎస్సీ వర్గీకరణలో ఎంబీ ఎస్సీ కులాల గొంతు కోశారని ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బైరి నరేశ్ అన్నారు. మాదిగలకు 11 శాతం కావాలంటున్న మందకృష్ణ మాదిగది అత్యాశ అని పేర్కొన్నారు. శుక్రవారం బషీర్‌బాగ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయాలనే సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తూనే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం దళితుల్లో అత్యంత వెనుకబడిన కులాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. తమ కులాలను ప్రభుత్వం ఏ గ్రూపులో కలకపోవడంతో మరోసారి తీవ్ర అన్యాయం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం 57 ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, రూ. 2 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమలో అంథోని వెంకన్న డక్కలి, సుద్దాల కుమారస్వామి, శ్రీనివాస్, పాండు, నవీన్, మహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బైరి నరేశ్

కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలింల తొలగింపు

బ్లాక్ ఫిలింలను తొలగిస్తున్న ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్ఐ రాము, వినోద్

మలక్ పేట, ఫిబ్రవరి 7: రవాణా శాఖ అధికారుల అనుమతి లేకుండా కార్ల అద్దాలకు బ్లాక్ ఫిలింలు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డీసీపీ వెంకటేశ్వర్లు వాహనదారులను హెచ్చరించారు బ్లాక్ ఫిల్లింల తొలగింపు పై చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మలక్ పేట మెట్రో స్టేషన్, దిల్ సుఖ్ నగర్, మూసారాంబాగ్ ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం 1988 లోని సీఎంవీ రూల్ 100, సెక్షన్లు 177, 179(1) ప్రకారం బ్లాక్ ఫిలింలు కలిగి ఉన్న వాహనదారులకు భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. మోటారు వెహికల్ యాక్ట్ 100 ప్రకారం కార్ల ముందు వెనక అద్దాలు 70శాతం వెలుతురు పడేవిధంగా కిటికీలకు 50 శాతం వెలుతురు పడేవిధంగా ఉండాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంత్రం ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం నిబంధనలను అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేసి రూ.1000 జరిమానా విధించటం తో పాటు బ్లాక్ ఫిలింలు తొలగింప జేస్తామని ఆయన అన్నారు. ఈ సందర్భంగా డీసీపీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, ఎస్సైలు రాము, యాదయ్య, వినోద్, ఘని, రామస్వామి పాల్గొన్నారు.

11న రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ పోటీలు

ఎల్బీనగర్, ఫిబ్రవరి 7(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎల్బీ నగర్ లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియం లో ఈ నెల 11న ఉదయం7 గంటలకు 14 సంవత్సరాలు పైబడిన వారికి జూనియర్ అండ్ సీనియర్ విభాగాలలో రన్స్, జంప్స్, త్రోస్ నిర్వహించి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్టు సంగం కార్యదర్శి గోపి తెలిపారు. వివరాలకు రంగారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ కోచ్ సాయి రెడ్డి నంబర్ 9703838987,9502210045 ను సంప్రదించగలరని కోరారు.

కుష్టువ్యాధి నివారణపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మి

రామంతాపూర్,ఫిబ్రవరి 7: రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ కుష్టు వ్యాధి దినం సందర్భంగా విద్యార్థులకు కుష్టు వ్యాధి నివారణ పై అవగాహన కల్పించారు. ఇండియన్ అసోసియేషన్ కోశాధికారి లెప్రోలజిస్టు డాక్టర్ రాజ్యలక్ష్మి కోనాధన్ మాట్లాడుతూ కుష్టును ముందుగా రోగ నిర్ధారణ ,ఎండిటీ బ్లిస్టర్ ప్యాక్‌లలో క్యాప్ రిపాంఫిసిన్ ట్యాబ్ డాప్సోన్ ట్యాబ్ క్లోఫాజమైన్ మల్టి డ్రగ్ థెరఫీ ద్వారా సమస్యను నివారించవచ్చునన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

బడంగ్‌పేట,ఫిబ్రవరి7: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అనుమతి లేకుండా ఇండ్ల నిర్మాణాలు చేపడితే చట్ట పరమైన చర్యలు తప్పవని టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప హెచ్చరించారు. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వారికి ఇప్పటికే నోటీసులు జారీ చేశామన్నారు. వెంచర్లు చేయాలన్న తప్పని సరిగా అనుమతి తీసుకోవాలన్నారు. కొంత మంది పాత గ్రామ పంచాయతీ లే అవుట్లు ఉన్నట్లు చెప్పడం సరికాదన్నారు. టౌన్ ప్లానింగ్ నుంచి అనుమతి వచ్చిన తర్వాతనే నిర్మాణాలు చేపట్టాలన్నారు. అనుమతి తీసుకోకుండానే సెల్లార్ నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, గ్రీన్ జోన్, ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మలక్‌పేట,ఫిబ్రవరి7: గుర్తు తెలియని మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... ఈ నెల 5న హోంగార్డు టీ మహేశ్వరి పెట్రోలింగ్ మొబైల్ వ్యాన్-2 పై విధులు నిర్వహిస్తుండగా, ఐసీఐసీఐ బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ శ్రావ్య డయల్ 100 కు ఫోన్ చేసి మలక్ పేట గంజి వద్ద ఫుట్ పాత్ పై గుర్తు తెలియని మహిళ స్పృహ తప్పి పడిపోయి ఉందని అందించిన సమాచారం మేరకు, వారు చాదర్ ఘా ట్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హోంగార్డు మహేశ్వరి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా సుమారు 50 సంవత్సరాల వయసు కలిగిన మహిళ స్పృహ తప్పి పడిపోయి ఉండటంతో 108 అంబులెన్స్ లో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు . కాగా చికిత్స పొందుతూ మహిళ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి గరిగుట్ట పెద్దమ్మ జాతర

పహాడీషరీఫ్, ఫిబ్రవరి 7: జల్లపల్లి మున్సిపల్ పరిధిలోని మాదన్నగూడ ప్రాంతంలో వెలసిన అడవి తల్లి వన మహోత్సవాలను ఘనంగా నిర్వహించడానికి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. కల్యాణ మహోత్సవ జాతరను మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించన్నుట్లు ఆలయ నిర్వాహకులు తెలపారు. ఈ జాతరను వీక్షించడానికి జల్‌పల్లి గ్రామస్తులతోపాటు సమీపంలోని శ్రీరాం కాలనీ, మామిడిపల్లి, పహాడీషరీఫ్, చాంద్రాయణగుట్ట, సరూర్‌నగర్, బాలాపూర్, కాటేదాన్ ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు వస్తుంటారు. గరిగుట్ట పెద్దమ్మ కల్యాణ మహోత్సవం శనివారం తెల్లవారు జామున 4.30 గంటలకు అమ్మవారి అభిషేకంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 9న పుట్ట బంగారం, బోనాలు, 10 న అగ్నిగుండాలు, ప్రవేశం, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.